క్లుప్తంగా

వరి విత్తనాలు విక్రయించే దుకాణాల తనిఖీ



వరి విత్తనాల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ రహీమ్

మొగల్తూరు: స్థానికంగా వరివిత్తనాలను విక్రయించే దుకాణాలను బుధవారం వ్యవసాయాధికారులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అమ్ముతున్నారా? లేక కల్తీ విత్తనాలు అమ్ముతున్నారా? అని తనిఖీ చేశామన్నారు. ఓ దుకాణంలోని రికార్డులు పరిశీలించి నాలుగు రకాల విత్తనాలను సేకరించి విత్తన పరీక్షా కేంద్రానికి పంపించామని స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి అధిక దిగుబడి సాధించేలా కృషి చేస్తున్నామన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



ముత్యాలపల్లిలో లోక్‌అదాలత్ కరపత్రాన్ని అందిస్తున్న పారా లీగల్ వలంటీర్ రాంబాబు

మొగల్తూరు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పారా లీగల్ వలంటీర్ నాగిడి రాంబాబు తెలిపారు. బుధవారం లోక్‌అదాలత్‌కు సంబంధించిన కరపత్రాలను అధికారులకు, ప్రజలకు అందజేశారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు పార్టీలు అంగీకారమైన సత్వర పరిష్కారం పొందవచ్చున్నారు. నరసాపురంలోని కోర్టులో జరిగే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

కళాకారులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి



కేజేఎం కేశవస్వామి

పాలకొల్లు అర్బన్: రంగస్థల కళాకారుల రూ.3వేల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని ఎస్ఆర్ఎల్‌జీ కళాసమితి ఉపాధ్యక్షుడు కేజేఎం కేశవస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రంగస్థల కళాకారులకు ప్రస్తుతం స్టేజి ప్రోగ్రామ్‌లు లేవని, అలాగే ప్రభుత్వానికి సంబంధించి ప్రచార కార్యక్రమాలు గానీ, లేదా ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో ప్రోగ్రాములు లేక కళాకారులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కళాకారుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని రూ.6వేలకు పెంచాలని కేశవస్వామి ప్రభుత్వాన్ని కోరారు.

మిగిలిన ఆహార పదార్థాల పంపిణీ



వడలిలో ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలిలో అక్షయ పాత్ర ఆధ్వర్యంలో మిగిలిన ఆహార పదార్థాలను అన్నార్తులకు పంపిణీ చేశారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరుడి ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలపై వడలికి చెందిన అక్షయ పాత్రకు సమాచారం అందించడంతో తీసుకువచ్చి వడలి ఎన్టీఆర్ కూడలిలో పంపిణీ చేశారు. సమాచారం అందించిన కాపిశెట్టి కొండబాబుకు అక్షయ పాత్ర సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, మేకా బసవయ్య, మేకా సురేష్, ఆటో వెంకటేష్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ఆకివీడు: మురుగు బోదెలలో పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా ముంపు నివారణకు మార్గం ఏర్పడుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి తెలిపారు. పట్టణంలోని ప్రధాన మురుగు బోదెలను జేసీబీతో పూడికలు తీత పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో పట్టణం ముంపునకు గురికాకూడదని ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపడుతున్నా, వ్యర్థాలు చేరిపోయి డ్రైయిన్లను ముంచెత్తుతున్నాయని చైర్‌పర్సన్ అన్నారు. కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ గంగానమ్మకోడు డ్రైయిన్‌లో పూడికతీత పనులు, మట్టి తొలగింపు పనులు పూర్తి చేశామన్నారు. మనుషులతో చాలా ప్రాంతాల్లో పనులు పూర్తి అయ్యాయన్నారు. కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, గేదల అప్పారావు, ఎండీ.ఆలీ, నేరెళ్ల విజయ్ పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధంతో రైతుల బెంబేలు



అగ్నిప్రమాదంలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



గాయాలతో ఉన్న గేదెలు



గేదెలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ

- ఒక్క రోజులో నియోజకవర్గంలో మూడు గడ్డివాముల దగ్ధం
- కాజపడమరలో మూడు గేదెలకు గాయాలు
- నియోజకవర్గంలో వరుసగా ఘటనలు

పాలకొల్లు సెంట్రల్/పాలకొల్లు అర్బన్: గడ్డివాము దగ్ధమై పక్కనే ఉన్న పశువుల పాక కూడా కాలడంతో మూడు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. యలమంచిలి మండలంలోని కాజ పడమర గ్రామంలో మంగళవారం రాత్రి గుబ్బల కృపారావు అనే రైతుకు చెందిన గట్టిమేటు దగ్ధమై పక్కనే ఉన్న పశువుల పాక కూడా అంటుకోవడంతో అందులో ఉన్న మూడు గేదెలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆ మూడు గేదెల్లో రెండు సవుడు కావడం గమనార్హం. సమాచారం అందుకున్న పశు వైద్యులు బుధవారం ఉదయమే అక్కడకు చేరుకుని తక్షణ వైద్య సదుపాయం అందిస్తున్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె. మురళీకృష్ణ మాట్లాడుతూ మూగజీవాల రోదన వర్ణనాతీతమని అన్నారు. మూడు గెదెల్లో రెండు సవుడివి కావడం చాలా బాధాకరమని అన్నారు. ఉదయం నుంచి మండల పశు వైద్యాధికారి పి.చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది గాయాలైన పశువులకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. మూడింటిలో ఒక పశువుకు మరింత తీవ్రమైన గాయాలై చర్మం మొత్తం కాలిపోయిందన్నారు. వాటికి ఆయిన్‌మెంట్ రాసి వైద్యం చేశామన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నానికి మూడు పశువులు లేచి నిలబడ్డాయన్నారు. మూడు రోజులు పాటు వైద్య పరీక్షల పర్యవేక్షణలో ఉంచిన తరువాత వాటి ప్రాణాపాయ స్థితిని గుర్తించగలమని అన్నారు. మూడు రోజులు దాటిందంటే ఆ పశువులకు ప్రాణాపాయస్థితి నుండి గట్టెక్కినట్లేనని తెలిపారు. అయితే గడ్డిమేట్ల దగ్ధం ఘటనలు ఎవరో కావాలనే చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఎక్కడ చూసినా గడ్డివాములే దగ్ధమయ్యాయని మొదటిసారిగా పశువులకు ప్రాణాపాయస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఆ మూగజీవాల రోదన మనసులు కలిచివేస్తుందని దీనికి కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. పశువైద్యాధికారులు పశువైద్య ఉప సంచాలకులు జవహర్ హుస్సేన్ భీమవరం, సహాయ సంచాలకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే కాజ పడమర గ్రామంలో కడలి వేణుగోపాలస్వామికి చెందిన 8 ఎకరాల గడ్డివాము మంగళవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. రూ.40 వేలు ఆస్తినష్టం సంభవించింది. ప్రమాదవార్త తెలియగానే పాలకొల్లు ఫైర్ ఆఫీసర్ కె.జానకిరామ్ తన సిబ్బందితో ప్రమాద ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వరిధనంలో

పాలకొల్లు మండలం వరిధనంలో జరిగిన అగ్నిప్రమాదంలో దొమ్మేటి నాగేశ్వరరావుకి చెందిన 8 ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40వేలు ఆస్తినష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. నరసాపురం నుంచి ఫైర్ ఇంజన్ వరిధనం చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఒక్క నెలలోనే 11 కేసుల నమోదు

ఈ నెలలో నియోజకవర్గంలో 11 గడ్డివాము దగ్ధం కేసులు నమోదయ్యాయని పాలకొల్లు అగ్నిమాపక శాఖ అధికారి జానకిరామయ్య తెలిపారు. ఈ నెల 5న మొదటి కేసు నమోదవ్వగా ఇప్పటి వరకూ 11 గ్రామాల్లో కేసులు నమోదయ్యాయన్నారు. పాలకొల్లు మండలంలో వడ్లవానిపాలెంలో 10 ఎకరాలు, పూలపల్లిలో 5 ఎకరాలు, పెదగరువులో 5 ఎకరాలు, గొల్లవానిచెరువులో 10 ఎకరాలు, వరిధనంలో 8 ఎకరాలు, అచ్చుగట్లపాలెంలో రెండు కేసుల్లో 11 ఎకరాలు, యలమంచిలి మండలంలో కాజ పడమరలో మూడు కేసులు ద్వారా 22 ఎకరాలు, శిరగాలపల్లిలో 2 ఎకరాలు మొత్తం ఇప్పటి వరకూ 73 ఎకరాలు పశువుల గడ్డి దగ్ధమైందని, వీటి విలువ సుమారు రూ. 7 లక్షల వరకూ ఉంటుందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెనుగొండ: వడలిలో గ్రామసమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని, పలు సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేశామని వడలి టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి చంటి అన్నారు. బుధవారం వడలిలో కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. కూటమి నాయకులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు రావడంతో వాటి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానాలు చేశారు.

విద్యాసామగ్రి అందజేత



మొగల్తూరు: కాళీపట్నంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సీతామహాలక్ష్మి



పాలకొల్లు సెంట్రల్: జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాసామగ్రి అందిస్తున్న దృశ్యం

మొగల్తూరు: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యాసామగ్రిని వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మి కోరారు. మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆమె పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కవురు ఆదినారాయణ, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలలో పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో విదార్థులకు ప్రభుత్వం అనేక విద్యా కానుకలు అందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ఉన్నత విద్యను అభ్యసించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. భవానీప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పథకాలతో పాటు వివిధ సేవా సంస్థల నుంచి సహాయ సహకారాలు అందుతున్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ధనాని సూర్యప్రకాష్, జనసేన పట్టణ అధ్యక్షుడు శిడగం సూరి, మజ్జి శంకరం, విన్నకోట గోపి, ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, చంద్రకళ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పట్టణ, మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్నారు. గత రెండు, మూడు రోజుల నుంచి పాఠశాలల వద్ద విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయడంతో సందడి నెలకొంది. పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ చేతుల మీదుగా స్టూడెంట్ కిట్లు అందజేశారు. స్టూడెంట్ కిట్లలో పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు బూట్లు, సాక్స్, టై, బెల్ట్‌లు అందజేశారు. రెండు జతల యూనిఫాం ఇంకా పాఠశాలలకు రాలేదు. దీంతో విద్యార్థులకు ఈ ఏడాది యూనిఫాం అందజేయలేదు. పట్టణంలోని 28 పాఠశాలలకు, పాలకొల్లు మండలంలోని 69 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 7,168 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేసినట్లు ఎంఈఓ వీరాస్వామి తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి



వైద్య సిబ్బంది, శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం రూరల్: మలేరియా, డెంగీ, చికున్ గున్యా మొదలైన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరాతీశారు. డ్రైయినేలు రెగ్యులర్‌గా నీరు నిలువ ఉండకుండా శుభ్రం చేయాలని తెలిపారు. అలాగే మురుగునిల్వ లేకుండా చేసి, నీటి నిల్వల వద్ద బ్లీచింగ్, స్ప్రేయింగ్ చేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు ఎక్కడైనా లీకేజ్ ఉంటే వెంటనే సంబంధిత సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు లీకులు కాకుండా రెగ్యులర్‌గా పర్యవేక్షించాలన్నారు. ఎఎన్ఎంలు, శానిటరీ సెక్రటరీలు దోమల లార్వా అదుపునకు ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పాత ఫ్రిజ్‌లు పూల కుండీలు, రుబ్బు రోళ్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆర్.రమేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ సాయి, ఏఈ వై.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సక్రమమైన మార్గంలో నడుచుకోవాలి



మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వివరిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు సక్రమమైన మార్గంలో నడుచుకోవాలని ఎటువంటి దురలవాట్లకు లోను కాకూడదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు లోనవడం వల్ల తమ జీవితంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను కూడా నిర్వీర్యం చేసే దుస్థితి ఏర్పడుతుందన్నారు. మంచి మార్గాన్ని ఎంచుకుని సక్రమంగా ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఎస్‌కే భవానీ, కళాశాల మాదకద్రవ్య వ్యతిరేక కమిటీ కో కన్వీనర్ వంశీ, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.యామిని, ఐక్యూ కోఆర్డినేటర్ కె భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



నరసాపురం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం.

నరసాపురం రూరల్: చేనేత బిడ్డ పముజుల సుచరిత హత్యాచారం ఘటనను తీవ్రంగా ఖండిస్తూ హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం నరసాపురం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్, నరసాపురం పట్టణ కార్యదర్శి ఒగ్గు సత్యనారాయణ మాట్లాడుతూ చీరాల మండలంలోని ఈపురుపాలెం గ్రామానికి చెందిన యువతి సుచరితపై ఇటీవల జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆమెను హత్యాచారం చేసిన హంతకులను వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కోశాధికారి సమతం శివప్రసాద్, కర్షభకుతల అధ్యక్షులు సమతం వెంకటేశ్వర్లు, ఒగ్గు సత్యనారాయణ, మోటూరి దుర్గా ప్రసాద్, రాపర్తి సత్యనారాయణ, ఆకురాతి బీమేశ్వరరావు, లింగరాజు భవాని ప్రసాద్, దేశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శుభాకరరావు

పెనుగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని పెనుగొండ మండల విద్యాశాఖాధికారి డి.శుభాకరరావు అన్నారు. బుధవారం పెనుగొండలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. 1 నుంచి 8 వ తరగతి వరకూ ప్రవేశాలు నిర్వహించడం, దీక్షాయాప్, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, 90 రోజుల సంసిద్ధతా కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. పాఠశాలల వారీగా నమోదైన విద్యార్థులన వివరాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పి.రామకృష్ణ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తగదు



ఆచంటలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

పెనుగొండ: ఏపీలో సీఎం చంద్రబాబు మాలలపై వివక్ష చూపుతూ వర్గీకరణ చేస్తానని అనడం తగదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ హితవు పలికారు. బుధవారం ఆచంట వేమవరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు చేసిన ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని, చంద్రబాబు జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తానని అనడాన్ని తీవ్రంగా ఖండించారు. జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆదేశాల మేరకు ఏపీలోని అన్ని జిల్లాల్లోనూ అంబేద్కర్ విగ్రహాల ముందు నిరసన చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు తార్లపాటి భాగ్యరాజ్, జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు నేత సాల్మన్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, బల్లా త్రిమూర్తులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దాడులు అరికట్టాలి

భీమవరం అర్బన్: టీడీపీ నాయకుల దాడులను అరికట్టి తమకు న్యాయం చేయాలని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు కారాడి జ్యోతి, మోకా లక్ష్మీ దుర్గ, తిరుమాని వీర భద్రరాజు మరికొందరు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపూసలమర్రులో జగనన్న కాలనీలో మంగళవారం పైపులైన్ పనులను టీడీపీ నాయకులు అడ్డుకొని రాళ్లను ధ్వంసం చేయడంతో బుధవారం లబ్ధిదారులు జగనన్న కాలనీలో తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇళ్లు లేని నిరుపేదలకు జగనన్న కాలనీలో 85 మందికి ఇంటి స్థల పట్టాలు ఇచ్చారన్నారు. గత మేలో కాలనీలో మట్టి పూడిక చేపట్టి లబ్ధిదారులకు రాళ్లు వేసి సరిహద్దులు నిర్ణయించారన్నారు. ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అనుమతితో పైపులైన్‌లు వేస్తుంటే సుమారు 30 మంది టీడీపీ నాయకులు వచ్చి పనులు అడ్డుకొని రాళ్లను ధ్వంసం చేశారు. అడ్డు వెళ్లిన లబ్ధిదారులపై దాడులు చేశారన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పేదలకు మేలు చేయాలి కాని దాడులు చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.